
# అమ్మమ్మ చెప్పని కథ

వాసిరెడ్డి సీతాదేవి



తెల్లవారి ఒక సాహిత్య సభలో కథ చదవాలి. రాత్రి తొమ్మిది దాటింది. కాగితాలూ, కలం తీసుకొని కథ రాయాలని కూర్చున్నాను. ఎంత ఆలోచించినా కథకు "ప్లాటు" దొరకలేదు. అర్థ గంట ఇట్టే గడిచి పోయింది. వంటింట్లోంచి అమ్మ సర్దుతున్న గిన్నెల మోతలు వినిపిస్తున్నాయి, చిరాకు వేసింది. లేచి బయట వరండాలోకి వచ్చి నిల్చున్నాను. చల్లని గాలికి ప్రాణం లేచి వచ్చినట్లయింది. మల్లెపూలు ఆరబోసినట్లున్న వెన్నెల కళ్ళకు హాయిగా తోచింది. ఆ వెన్నెల్లో మంచం వేసుకొని పడుకొని హాయిగా నిద్రపోవాలనిపించింది. కానిఎలా? రేపటికి ఒక కథ కావాలే? ఎందుకొచ్చిన బాధ? బాధ అనుకుంటే కీర్తి దాహం తీరేది ఎలా?

ఇంతలో పక్కనుంచి ఎవరో గొణుగుకున్నట్లు వినిపించి తల తిప్పిచూశాను. అమ్మమ్మ ఆరుబయట వెన్నెల్లో నులక మంచంమీద పడుకొని గోవిందనామాలు పాడుకుంటుంది. లేదు చదువుకుంటూంది, అమ్మమ్మ పాటలో శృతి అందానికి ఆశ్రయం లభించదు, కాని అమ్మమ్మకు తన పాటను గురించి చాలా మంచి అభిప్రాయమే ఉన్నది, అడిగిందే తడవుగా పాట ఎత్తుకుంటుంది.

అకస్మాత్తుగా నా బుర్రలో నుంచి ఓ ఆలోచన దూసుకుపోయింది. (అమ్మమ్మదగిరే కథకు "ప్లాటు" సంపాదిస్తే? అమ్మమ్మలకు చాలా కథలు వస్తాయి, ఈనాడు పత్రికల్లో వస్తున్న

చాలా కథలకంటే అమ్మమ్మలు చెప్పే కథలే బావుంటాయి! "అమ్మమ్మ చెప్పిన కథ అనే పేరుతో రేపు వత్రలో కథ చదివేయొచ్చును.) నా సమస్యకు పరిష్కారం దొరికినందుకు ఉత్సాహంగా అమ్మమ్మ మంచంవైపుకు నడిచాను.

"దా! దా! ఈసారి నిజంగా వచ్చావే!' అంటూ అమ్మమ్మ మంచానికి ఓరగా జరిగి మంచంకింద వున్న తన క్రరకోవం చేతిని కిందకు పెట్టింది.

"నిజంగానే వచ్చానురా బాబూ! ఈ ముసల్ది నన్ను లెక్క అనుకుంటూంది." అని అని కుంటూ "అమ్మమ్మ! నేను. నేను." అంటూ గబగబా దగ్గరగా అనేశాను.

"నువ్వంటే పిల్లా! నేనింకా ......"

"అదేలే— లెక్క అనుకున్నావు. కాస్త యితే నా కాళ్ళు విరగ్గొట్టేదానివే.' అంటూ అమ్మమ్మ తల దగ్గిరగా మంచం మీద కూర్చున్నాను.


"అన్నం తిన్నావా? అమ్మ ఏం చేస్తోంది." ఆప్యాయంగా నా చేతికోసం, ములకతాళ్ల పెన వేసినట్లు నరాలు తేలివున్న చేతిని చాచింది అమ్మమ్మ.

అమ్మమ్మ చేతికి నా చేతిని అందిస్తూ "అమ్మమ్మా! అన్నాను.

"ఏం తల్లీ! గోవిందనామాలు పాడ మన్నావా?" అమ్మమ్మ అడిగింది ఉత్సాహంగా. నాకు అమ్మమ్మ పాడే గోవింద నామాలంటే చాలా ఇష్టం. తోచనప్పుడల్లా అమ్మమ్మ చేత గోవిందనామాలు పాడించుకొని వింటూ వుంటాను. అందుకే అమ్మమ్మకు తన మనుమలూ, మనుమ రాళ్ళందరిలో నేనంటే ఎక్కువ ఇష్టం.

"ఎప్పుడూ గోవిందనామాలేనా?" అన్నాను

"పోనియ్ ఊర్మిళాదేవి నిద్రపాడతాలే. అం టూ" నా జవాబుకుకూడా ఎదురుచూడకుండానే అమ్మమ్మ "ఊర్మిళాదేవి" నిద్రపాటను అందు కుంది.






"ఊర్మిళాదేవి నిద్రావద్దు, సీతమ్మవారి అగ్ని ప్రవేశమూవద్దు" అన్నాను చిరాగ్గా.

అమ్మమ్మ పాట తక్కున ఆగిపోయింది. అమ్మమ్మ వర్షంలో తడిసిన ములకమంచంలా బిగుసుకు పోయింది.

అమ్మమ్మకు కోపం వచ్చింది. తడిసి బిగిసి పోయి కోళ్లపైకి లేచిన నులక మంచాన్ని యథాస్థితిలోకి తేవటం ఎంత కష్టమో, అమ్మమ్మ అలక తీర్చటం కూడా అంతే కష్టం అని నాకు తెలుసు.

"అమ్మమ్మా! అన్నాను ప్రాధేయపూర్వ కంగా. అమ్మమ్మ ఉలకలేదు పలకలేదు.

"అమ్మమ్మోయ్!" అన్నాను ప్రతిమాలుకుంటు నట్లు.

"ఊఁ ఏం?" అంది అమ్మమ్మ.

"ఓ కథ చెప్పు. అమ్మమ్మా!' అన్నాను.

అమ్మమ్మ మంచంలో కదిలింది. ఆ కదలి కలో నాకు ఉత్సాహం కనిపించింది. లేచి కూర్చోవటానికి ప్రయత్నిస్తున్న అమ్మమ్మను వారిస్తూ "కూర్చోనక్కరలేదు. పడుకొనే చెప్పు అమ్మమ్మా!" అన్నాను.

అమ్మమ్మ కూర్చోనే ప్రయత్నం మాని కథ చెప్పటానికి సిద్ధం అయింది. "కథ చెబుతున్నంత సేపూ ఊఁ కొట్టాలి తెలిసిందా?" అంది అమ్మమ్మ అదేదో పెద్ద షరతు పెడుతున్నట్లు.

"అలాగేలే! త్వరగా కథ చెప్పు అన్నాను. అప్పటికప్పుడే పది దాటిపోయింది. అమ్మమ్మ కథ వినాలి. మళ్ళీ దాన్ని నేను రాయాలి.

"ఉండూ మరి! అటా తొందర పెడితే కథ ఎట్లా వస్తుందే!" అంటూ అమ్మమ్మ ఆలోచన లోకి జారిపోయింది.

ఏం చేస్తాను! నోరు మూసుకొని అమ్మమ్మ ఎప్పుడు ఆ బోసి నోటిని తెరుస్తుందా అని చూస్తూ కూర్చున్నాను.

"ఈ కథ నాకు మా అమ్మమ్మ చెప్పిందో, నాయనమ్మ చెప్పిందో గుర్తు రావటంలేదే అమ్మాయ్." అంది అమ్మమ్మ ఆలోచిస్తున్న ధోరణిలో.

"ఎవరు చెబితేనేంలే అమ్మమ్మా! నాకు ఆ కథ చెప్పు." అన్నాను నాకు కావాల్సింది కథ కదా అని.

"అట్లా అనవాకే పిల్లా. ఎవరు చెప్పారో గుర్తు చేసుకోకుండా ఆ కథ చెప్పటం అంత మంచి పనికాదు" అంది అమ్మమ్మ.

అమ్మమ్మ చెప్పిన మాటలో అర్థం బోధపడక "ఏం, ఎందుకు మంచిపనికాదు?" అన్నాను,

"మా అమ్మమ్మ కథ చెబితే ఒక రకంగా వుంటుంది, మా నాయనమ్మ కథ చెబితే ఒక రకంగా వుంటుంది" అంది అమ్మమ్మ.

"ఎవరు చెప్పినా ఆ కథేగా! వినిగింపక ఎప్పుడూ?" అన్నాను విసుక్కుంటూ.

"కథ అదేనమ్మకో! కాని మా అమ్మమ్మ ఆ కథనే ఒక రకంగా చెప్పేది. మా నాయనమ్మ మరో రకంగా చెప్పేది." అంటూ అమ్మమ్మ ఆ కథ తనకు ఎవరు చెప్పారో జ్ఞాపకం చేసు కొనే ప్రయత్నంలో పడిపోయింది.

నాకు వళ్లు మండిపోయింది.

"అమ్మమ్మకూ నాయనమ్మకూ భేదం ఏమిటో చెప్పు ముందు" అన్నాను.

"ఈ మాత్రం తెలియదటే పిల్లా! పైగా చదువుకున్నావ్! అమ్మమ్మ అంటే అమ్మకు అమ్మ, నాయనమ్మ అంటే నాయనకు అమ్మ" అంది అమ్మమ్మ తన చమత్కారానికి తానే మురిసిపోతూ. నాకు మండుతున్న అగ్నిమీద నెయ్యి పోసినట్లనిపించింది.

"నే న డి గిం ది అ ది కాదమ్మమ్మా! మీ అమ్మమ్మ చెప్పే కథకూ, నాయనమ్మ చెప్పే కథకూ భేదం ఏమిటీ అని!" అన్నాను మాటల్ని కొంచెం సాగదీస్తూ.

"కథ ఒకటేనే పిచ్చితల్లీ!" అంది అమ్మమ్మ.

అమ్మమ్మ పడుకున్న ఆ మంచాన్ని దొర్లించాలనిపించింది. అయితే మా యిద్దరికీ మధ్య అమ్మ ఒకటి వుండిపోయిందని వూరుకున్నాను.

"నువ్వే చెప్పావుగా ఏదో తేడా వుందని! బోడితేడా!" అన్నాను ఉడుకుబోతుతనంగా.

"ఓసి భడవా! నేను అన్నానటే అలాగని!" అమ్మమ్మ దబాయింపు ధోరణికి నేను ఆశ్చర్య పోయాను.

ముసల్దానివి. నీకు మతిమరుపు సహజమేలే ఇందాక అన్నావు! బాగా గుర్తుచేసుకో!" అన్నాను దబాయిస్తున్నట్లు,

"నీవయస్సెంతే పిల్లా!" అడిగింది అమ్మమ్మ తాపీగా.

"ఇప్పుడు నా వయస్సు సంగతెందుకే నిన్ను కథ చెప్పి చావమంటుంటేనూ!" ఆ పైన ఏమనాలో తోచక కోపాన్ని దిగమింగుకున్నాను.

"పో నీ నా వయస్సెంతో చెప్పుకోవేం చూద్దాం" అంది అమ్మమ్మ ముసిముసిగా అదే బోసిబోసిగా నవ్వుకుంటూ.

"నీ తికమక తగలెయ్యా! ఇప్పుడు వయ స్సుల సంగతెందుకే కథ చెప్పమంటుంటేనూ!" అన్నాను కసిగా. అమ్మమ్మే నాకంటే చిన్నదై వుంటే రెండు మొట్టికాయలు పెట్టి ఉండేదాన్ని.

"ఓసి పిచ్చికట్టే! ఈ మాత్రానికే ఇంత తిక మకలో పడేదానివి, ఇహ కథవింటే ఏమయిపో తావే అమ్మాయ్!" ఉన్న రెండుపళ్ళు ఊగిస లాడుతుంటే పకపకా నవ్వబోయి-రాక ఆపుకు నవ్వే నవ్వేసింది అమ్మమ్మ.

ఆ నవ్వు చూస్తుంటే..కాదు వింటుంటే... కాదు అసలు వినబడందే! అనే చూస్తుంటే ఒక గుద్దుగుద్ది ఆ వున్న రెండు పళ్ళు ఊడపెరకా లనిపించింది, కాని అమ్మమ్మ ఏమయిపోయిందని ఊరుకున్నాను.

"అదేమిటే అమ్మమ్మా! పైగా నేను తికమక పడుతున్నా నంటావ్! అంతా నువ్వే తికమక చేసి!" అన్నాను ఆశ్చర్యంగా.

"ఓసి రాలుగాయి, నువ్వేగదే తికమక తిర గేసి మక తిక చేశావు:" అంది అమ్మమ్మ నిర్ల క్ష్యంగా.

"ఓసి నీతిక్కదావ, ఆ చెప్పేదేదో సరిగా చెప్పి ఏడవరాదూ:" అన్నాను కోపంగా.

"వేలెడంతున్నావ్ నీకెంత పొగరే: ముందు నీ తిక్క కుదిరితేగాని నేను చెప్పేది నీ కర్థం కాదు." అని అమ్మమ్మ మూతి ముడుచుకుంది. ముడుచుకోవటానికి పళ్ళు లేవుగా అందుకని లోప లికి తీసుకుంది. అమ్మమ్మ తీసుకోవటం ఏమిటీ: మూతి దానంతటదే లోపలికి పోయింది. ఇప్పుడు పోవటం ఏమిటి, ఎప్పుడూ లోపలికే వుంటుందిగా: సరే ఎట్లాగోట్లా వచ్చిందిలే ఆ మూతిగొడవ ఇప్పుడెందుకు: ఇప్పుడు నాకు కావాల్సింది కథ. కాని అమ్మమ్మకు కోపం వచ్చిందిగా.

"ఇంతకూ కథ చెబుతావా లేదా:" అన్నాను

"నేను చెప్పనన్నానుటే: చెబుతూనే వున్నాగా" అమ్మమ్మ అంది. అమ్మమ్మకూ కథ చెప్పాలనే వుంది. కాని మధ్య బాద స్త్రం అడ్డుపడుతుంది అనుకున్నాను.

"అయితే చెప్పు ఊరికే సాగదీయకుండా:" అన్నాను.

"సాగదీయకపోతే అది అసలు కథ ఎలా గవుతుందే:" అమ్మమ్మ నిలదీసినట్లు ప్రశ్నిం చింది. నాకు జవాబు తోచలేదు.

"కట్టె - కొట్టె - తెచ్చె - అన్నట్లు కథ చెప్తే అది కథ కానేకాదు." అంటూ అమ్మమ్మ బిగదీసుకు పోయింది. వంగిపోయిన అమ్మమ్మ బిగదీసుకు పోవటం ఏమిటిగాని... ముడుచుకు పోయింది. ముడుచుకు పోవటం ఏమిటి అంతా ముడతలు పడ్డ శరీర మేగా: ముడుచుకో బోయి, కాదు బిగదీసుకో బోయి. ఏదో అయిపోయిందను కుంటాను. ఇంకా సేపు అమ్మమ్మ దగ్గర కూర్చుంటే నేను కూడా ఏదో అయిపోవచ్చు.

"నన్ను వెళిపొమ్మన్నావా: కథ చెబుతావా:" విసుక్కుంటూ అడిగాను.

"అసలు కథ అంటే ... ..."

"కథ అంటే ఏమిటో నువ్వు చెప్పొద్దుగాని... నువ్వు చెప్పదలచుకున్న ఆ కథ ఏమిటో త్వరగా చెప్పు:" అన్నాను అమ్మమ్మను ప్రాధేయపడుతూ.

"అంటే పిల్లా: నీ ఉద్దేశం... కథంటే ఏమిటో నాకు తెలియదనేనా:" కమ్మన లేచింది అమ్మమ్మ.

"కథంటే ఏమిటో మహా మహా వాళ్ళకే తెలియదు. నీకేం తెలుసే అమ్మమ్మా: అన్నాను. అమ్మమ్మ మీద కసితీర్చుకుంటున్నట్లు.

"కథ అంటే ఏమిటో తెలియకుండా కథ ఎలా చెప్పగలనే నాకు తెలియకడుగుతాను:" అంది అమ్మమ్మ. నొసలు చిట్లించి. ఇప్పుడు చిట్లించటం ఏమిటి అవి ఎప్పుడూ చిట్లించే వుంటాయి.

"అదేమో నాకూ తెలియదు. నీకు చెప్పినా అంతకంటే అర్థం కాదు.

"తెలియనిదాన్ని గురించి నువ్వెందుకే మాట్లాడుతావు: అమ్మమ్మ కసకొట్టింది. అంటే నోట్లోంచీ నాసికా రంధ్రాలనుంచీ గాలి వది లింది.

"సరే: మాట్లాడనుగాని. నా ప్రాణాలు తోడక. కథ చెప్పుమరి:" అన్నాను అమ్మమ్మను బతిమాలుకుంటూ.

"అట్లా రావేదారికి:" అంది అమ్మమ్మ విజయగర్వంతో. మరచెంబుడు మంచి నీళ్ళు గటగట తాగాలనిపించి మరచెంబు కోసం మంచంకిందకు చూసింది అమ్మమ్మ. అక్కడ మరచెంబు లేదు. ఉన్నా అందులో నీళ్లుండవు నీళ్ళు వున్నా అమ్మమ్మ అసలు అంత గటగట తాగలేదు.

అమ్మమ్మ దారిలోపడి అమ్మమ్మను ప్రాధేయ పడ్డాను. విసిగించక త్వరగా కథ చెప్పమని. అమ్మమ్మ ముసి ముసి. అదే. ముసలి... ముసలి... నవ్వులు నవ్వుకొని అడి గింది.

"మా నాయనమ్మ చెప్పినట్లు చెప్పమన్నావా. మా అమ్మమ్మ చెప్పినట్లు చెప్పమన్నావా:" అంది అమ్మ.

"నీ నస పాడుగాను మళ్ళీ మొదటికొచ్చావ్: అనుకుంటూ "ఎట్లాగో అట్లాచెప్పి చావవేతల్లీ: అన్నాను విసుగ్గా.

"అయితే మా అమ్మమ్మ చెప్పినట్టే చెప్ప మంటావన్నమాట: ముందే అట్లా అడగూడదే పిల్లా: ఈ సొదంతా లేకుండా పోను:" సంతోషంగా అంది అమ్మమ్మ. సూదిలోకి దారం ఎక్కించ గలిగినప్పుడు అమ్మమ్మకు కలిగే ఆనందమే ఇప్పుడూ కలిగింది అమ్మ మ్మకు.

నాకు అంతులేని ఆశ్చర్యం కలిగింది.

"మీ అమ్మమ్మ చెప్పిన కథ... అదే. మీ అమ్మమ్మ చెప్పినట్లు చెప్పమని నే నెప్పుడడి గానే అమ్మమ్మా:" అన్నాను పూర్తిగా ఆశ్చర్యం నుంచి కోలుకోకుండానే.

"ఇప్పుడు అడిగావుగాదే తల్లీ: అంతలోకే మతిమరుపా:" అంది అమ్మమ్మ.

"మతిమరుపూ లేదూ మాట మార్పూ లేదూ. అసలు నేను అలా అడగందే:" అమ్మమ్మ దబాయింపుకు జవాబు అంతకంటే గట్టిగా చెప్పలేక పోయాను.

"నువ్వే - చెప్పిచావమన్లేదా:" అమ్మమ్మ ఉక్రోషంగా అడిగింది.

"అవును చెప్పిచావమన్నాను"

"అదేమరి: అది మా అమ్మమ్మ చెప్పినట్లు అంది అమ్మమ్మ ధీమాగా.

"అంటే:" బుర్ర తిరిగిపోయి అడిగాను.

"మా అమ్మమ్మ కథ చెబితే చాను దచ్చి నంత పని అయ్యేది. కథ చెప్పి మంచానికి అడ్డంపడి ఆరు నెలలు తీసుకునేది."

"ఎందుకూ:" అయోమయంగా ప్రశ్నించాను

"మళ్ళీ కథ దొరికేదాకా మంచంమీద నుంచి లేచేది కాదు." అంది అమ్మమ్మ.

"కథ దొరకటం ఏమిటమ్మమ్మా:" అన్నాను వెర్రి మొహంవేసి

"అదేనె పిల్లా: మా అమ్మమ్మకు మరి చదువురాదుగా: అందుకే మళ్ళీ కథ దొరక టానికి ఆరు నెల్లన్నా పట్టేది:

"చదువొస్తే:" ప్రశ్నమార్కు ముఖం పెట్టాను.

"చదువొస్తే కథలకు కరువేంటే అమ్మాయ్. సవాలక్ష కథలు బోలెడన్ని పుస్తకాల్లో. బోలె డన్ని భాషల్లో దొరుకుతాయ్:" అంది అమ్మమ్మ బోసిబోసిగా నవ్వుకుంటూ.

అమ్మమ్మ గడుసుదనానికి ఆశ్చర్యంవేసింది. నవ్వూ వచ్చింది. అమ్మమ్మ అంటించిన చురక తాలూకు వేడిలో నాకు భాగం వుందేమోనని నాలో నేనే ఉలిక్కిపడ్డాను.

"అయితే అమ్మమ్మా: మీ అమ్మమ్మ చెప్పి నట్లు నువ్వూ కథచెప్తే నువ్వూ ఆరు నెలలు మంచం పడతావా:" భయపడుతున్నట్లు అడి గాను అమ్మమ్మను. మాటమారుస్తూ.

"ఒనే అమ్మాయ్: కోడి ఏం తింటుందే:" అంది అమ్మమ్మ రెట్టించినట్లు.

"పెసలూ. పజలూ. అన్నాను కోపంగా: అమ్మమ్మా వాళ్ళ అమ్మమ్మ చెప్పే కథలో కోడి పాత్ర యేమిటో నాకు అర్థంకాక ఒళ్లు మండి పోయింది:

"ఇంకా ఏం తింటుంది:" ముసి ముసిగా అదే ముసలి ముసలిగా నవ్వుతూ నా ముఖం లోకి చూసింది అమ్మమ్మ.

"నా వల్లకాదు." అన్నాను ఉబికివస్తున్న కోపాన్ని పళ్లబిగువుతో ఆపుకుంటూ.



DOL-327 TEL

"కాదే అమ్మాయ్! రాళ్ళు." అంది అమ్మమ్మ.

కోపాన్ని అణచుకునే ప్రయత్నంలో కింది పెదవిని పై పళ్ళతో నొక్కిపట్టాను. మాట్లాడ లేదు.

"కోడి రాళ్ళను తింటుంది. కాని అది వాటిని జీర్ణం చేసుకోదు." అంది అమ్మమ్మ.

"వెధవ సోదా నువ్వూ. నాకర్థం కావటం లేదు. సరిగా చెప్పిచావు" అన్నాను ఉక్రోషంతో.

"నువ్వేదిగావు కాదుటే! మా అమ్మమ్మ కథ చెప్పినట్లు నేనూ చెబితే, నేనుకూడా మందం వడి కానా అని?" అంది అమ్మమ్మ విసుక్కుంటున్నట్లు.

అమ్మమ్మ చమత్కారి అని నాకు తెలియదు. అమ్మమ్మకు ఇన్ని విషయాలు తెలుసునని కూడా నాకు తెలియదు.

"కథ చెప్పమంటే విలువునా చంపేశావు అమ్మమ్మా!" అన్నాను.

"ఓహో అదటే అమ్మాయ్! మా నాయనమ్మ చెప్పినట్లు చెప్పమంటావా?" కళ్ళు పెద్దవి చేసింది నాయనమ్మ. కాని నాకలా అనిపించింది.

"అని నే నడగలేదే!" అన్నాను ఆశ్చర్యపోతూ.

"ఇప్పుడే అడిగావుగదే. మళ్ళీ ఒట్టేస్తావూ?" అమ్మమ్మ దబాయించింది.

"అంటే?" అన్నాను దిమ్మెరపోయి.

"అదే విలువునా చంపేశావు అనలా?" అమ్మమ్మ రెట్టించింది.

"అన్నాను-అంటే?" వెర్రిమొహం వేసి అడిగాను.

"మా నాయనమ్మ కథచెప్తే విన్నవాళ్ళు అలా విలువునా చచ్చేంత పర్యంతం అయేదే అమ్మాయ్! మళ్ళీ ఆరు నెలలదాకా కథ చెప్పమని అడిగితే ఒట్టు!" అంది అమ్మమ్మ.

"అలాచెప్పి అమ్మమ్మా అంత ఘోరం చేయొద్దు! మీ నాయనమ్మ చెప్పినట్లుగా కాకుండా కొద్దిగానైనా మార్పుచేసి చెప్పు" అని అడగాను వస్తున్న నవ్వుని ఆపుకుంటూ.

"అది నావల్లకాదే పిల్లా!" అంది అమ్మమ్మ.

"అదేమిటి అమ్మమ్మా!" అన్నాను.

"నాయనమ్మ చెప్పినట్టే చెబుతాను. మార్చి చెప్పి ఆ కథను నా సొంతం చేసుకోవడం నా వల్లకాదే పిల్లా!" అంది అమ్మమ్మ అదోలా నవ్వుతూ.

వెనకనుండి అకస్మాత్తుగా ఎవరో కాళ్ళు పట్టుకు లాగితే బొక్కబోర్లా ముక్కుకు దుమ్మంటేలా కింద పడ్డంత పనయింది నాకు.

"అమ్మమ్మా ఒక సందేహం అడగనా?" అన్నాను ముక్కుకు అంటిన దుమ్మును దులుపుకుంటూ.

"నువ్వు సవాలక్ష ప్రశ్నలు అడుగు. నా సమాధానం ఒకటేనే పిల్లా!" అంది అమ్మమ్మ.

అయితే సవాలక్ష సందేహాలనూ కుదించి ఒకే ప్రశ్న అడుగుతాలే అన్నాను.

"ఓ భేషుగ్గా" అంది అమ్మమ్మ.

"చూడూ అమ్మమ్మా! మీ నాయనమ్మ చెప్పిన కథ బాగుంటుందా, మీ అమ్మమ్మ చెప్పిన కథ బాగుంటుందా?" అన్నాను.

"ఓసి నీ పిచ్చి దొంగగొడ్డోలా! వాళ్లిద్దరు చెప్పిందీ ఒకటే కథ అని నీకు వంద సార్లు చెప్పాను గదే" అమ్మమ్మ ఖాంద్రించబోయి ఊరుకుంది.

వంద సార్లు కాకపోయినా వందలో సున్నాలు తీసేసినన్నిసార్లు అమ్మమ్మ చెప్పిన విషయం వాస్తవమే గనుక బాగా తగ్గిపోయి అన్నాను.

"ఐ యామ్ సారీ అమ్మమ్మా! నేను నిన్ను అడిగేదేమిటంటే?" పెద్దగా అన్నాను.

"నాకు చెముడు లేదుగాని అడుగు!" అంది అమ్మమ్మ.

"మరే! అమ్మమ్మా! మీ అమ్మమ్మ కథ చెబితే బాగుండేదా? మీ నాయనమ్మ కథ చెబితే బాగుండేదా?" అన్నాను.

ఈసారి అమ్మమ్మ నా ప్రశ్నకు వెంటనే జవాబివ్వలేదు. కొంచెం ఆలోచించి అంది "ఆ సంగతి మహా మహా వాళ్ళకే తేలక..." అంటూ ఆగిపోయింది అమ్మమ్మ.

"ఊ! తేలక" అన్నాను ఆదుర్దాగా.

"తేలక ఆ నగరంలోని ముఖ్యులంతా కలిసి రాజుగారి దగ్గరకు వెళ్ళారు తేల్చి చెప్పమని" అంటూ ఆగిపోయింది అమ్మమ్మ.

"రాజుగారు ఏమని తేల్చారు?" ఆత్రుతతో అడిగాను.

"రాజుగారికీ తేలక ఆయన తన ఆస్థాన పండితులనందర్నీ పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో ఈ విషయాన్ని తేల్చి చెప్పటం కొరకు ఒక రహస్య కమిటీని వేశారు." అంటూ అమ్మమ్మ మళ్ళీ ఆలోచనలో పడింది.

"ఆ కమిటీలో ఎవరెవరున్నారు" అడిగాను.

"ఆ కమిటీలో ఎవరున్నారో?" ఎవరికీ తెలియదు. అది రహస్య కమిటీ అని చెప్పానుగా? అయితే ఆ కమిటీలో వున్నవాళ్ళ పేర్లు మా అమ్మమ్మకూ, నాయనమ్మకూ మాత్రం తెలిసిపోయాయట?"

"అదేమిటి అసలు వాళ్ళకే పేర్లు తెలిసిపోతే అది రహస్యకమిటీ ఎలా అవుతుంది?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఇదిగో అమ్మాయ్! అర్థప్రశ్నలు వేయకుండా విను!" కసురుకుంది అమ్మమ్మ. ఈ ముసలిది నన్ను సస్పెన్స్‌లో వదేసి బిగుసుకుపోతుందేమోననే భయంతో నోరు మూసుకున్నాను.

"అమ్మమ్మా!" అతిమృదువుగా పిల్చాను.

"ఊ!" అంది అమ్మమ్మ మహాబెట్టుగా.

"మీ అమ్మమ్మనూ, నాయనమ్మనూ పిలిపించి కథ చెప్పించుకొని విన్నారా కమిటీవాళ్ళు?" అడిగాను.

"అలాచేస్తే అమ్మమ్మగానీ, నాయనమ్మగానీ తమమీద ఒత్తిడి తెస్తారేమోనని కమిటీ వారి భయం" అంది అమ్మమ్మ ఆలోచనగా.

"మరి నిర్ణయం ఎలా చేశారు?"

"కమిటీవారికి హితులయినవారి సలహాలను సేకరించడానికి నిర్ణయించారు. వారు అమ్మమ్మ కథచెప్పగా విన్నావారినుంచీ నాయనమ్మ కథచెప్పగా విన్నావారి నుంచీ అభిప్రాయాలను సేకరించి కమిటీకి నివేదించుకున్నారు."

"ఏడ్చినట్లుంది!" అనాలనిపించింది. కాని అమ్మమ్మకు కోపం వస్తుందని ఊరుకున్నాను.

"ఊ! తరవాత?" అడిగాను అమ్మమ్మను.

"కమిటీవారు, తమ హితుల ద్వారా అందిన నివేదిక మీద అహోరాత్రాలూ చర్చించీ, మథించీ, కుదించీ చివరకు ఒక నిర్ణయానికి వచ్చారు. వచ్చి, రాజుగారి దగ్గరికెళ్ళి తమ నిర్ణయాన్ని వినిపించి ఆయన సలహాను అడిగారు."

"అదేమిటి మళ్ళీరాజుగారిని సలహా అడగటం ఏమిటి?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"మరి రాజుగార్ని సలహా అడక్క నిన్నూ నన్నూ అడుగుతారా? ఆ కమిటీ రాజుగారు వేసిందేగా?" విసుక్కుంది అమ్మమ్మ.

"చివరకు మీ అమ్మమ్మ గెలిచిందా? నాయనమ్మ గెలిచిందా?" ఆదుర్దాగా ఊపిరి బిగపట్టి అడిగాను.

"నువ్వేచెప్పు చూద్దాం?" అమ్మమ్మ ఆవులించింది. కళ్ళుమూసుకుంది.

అమ్మమ్మను చిటికెనవేలుమీదగిరగిరా గిరగిరా తిప్పి గాల్లోకి విసరాలనిపించింది.

"నేను చెప్పటం ఏమిటి నాతలకాయ? సస్పెన్సుతో చంపక చెప్పు?" అన్నాను.

"సస్పెన్సు లేనికథేమిటే? నాకు నిద్రవస్తుంది. నువ్వుకూడా రేపు ఏదోసభలకు వెళ్ళాలంటున్నావుగా వెళ్లి పండుకో!" అంటూ అమ్మమ్మ సులక మంచానికి అడ్డంపడి ముసుగు తన్ని పెట్టింది.

"అమ్మయ్యోయ్ నా కథ. నా కథ?" అన్నాను ఆదుర్దాగా?

"నీకథ అయితే నువ్వే చెప్పుకోవే? మధ్య నేనెందుకు?" గురకపెట్టింది అమ్మమ్మ. ●

(ఇటీవల వరంగల్లులో జరిగిన రచయిత్రుల సభలో చదివిన కథ)

దీర్ఘ రోగులకు చికిత్స

మే రోగమైననూ
యెంతకాలముగా
నున్ననూ మాసలహాతో
ఆరోగ్యమును పొందండి
ప్రతి రోగాన్ని అనుభవ ప్రజ్ఞా విశేషముల తో నివారించగలము
కవిరాజ్ మోహన్.